బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన



లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

శామీర్‌పేట్: బకాయి వేతనాలు చెల్లించాలని లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా 4 నెలల బకాయి వేతనాలను చెల్లించాలని అధికారులను కోరితే అకౌంట్‌లో డబ్బులు లేవని సమాధానం చెబుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన వేతనాలను చెల్లించి ఆదుకోవాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. సిబ్బంది ఆంజనేయులు, ఉప్పలయ్య, రఘురాములు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

జవహర్‌నగర్‌లో ఎంఆర్‌ఎఫ్ షోరూమ్ ప్రారంభం



జవహర్‌నగర్‌లో ఎంఆర్‌ఎఫ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న డివిజనల్ సౌత్ హెడ్ ఈశ్వర్ పి ఇత్నాల్, రమ్యజైపాల్‌రెడ్డి, కుతాడి రవీందర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ఆనంద్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిలో రమ్యజైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌ఎఫ్ షోరూమ్‌ను శనివారం డివిజనల్ సౌత్ హెడ్ ఈశ్వర్.పి ఇత్నాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, నాణ్యతకు, నమ్మకానికి ప్రమాణికంగా ఎంఆర్ఎఫ్ నిలుస్తుందన్నారు. వాహనదారులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, జవహర్‌నగర్‌కు ఎంఆర్‌ఎఫ్ రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ అమర్‌నాథ్, కాంగ్రెస్ నాయకులు కుతాడి రవీందర్, కంపెనీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



జవహర్‌నగర్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోటపల్లి శంకర్ తదితరులు

జవహర్‌నగర్: భగత్‌సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని బీకేఎంయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత విప్లవ ఉద్యమాలకు దిక్సూచిగా భగత్‌సింగ్ నిలిచారన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాదగిరి, రాజేశ్వరి, లక్ష్మణ్, ఎల్లయ్య, నర్సింహ, అశోక్‌చారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాచవానిసింగారం బీజేపీ బూత్ అధ్యక్షుల నియామకం



నియామక పత్రం అందజేస్తున్న ప్రవీణ్‌రావు, బస్వరాజ్‌గౌడ్

ఘట్‌కేసర్: కాచవానిసింగారం గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులను శనివారం ఎంపిక చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్‌గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రభంజన్, గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎంపిక చేయగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. 363 బూత్ బీజేపీ అధ్యక్షులుగా శంకర్, 364 బూత్ అధ్యక్షుడిగా జితేందర్, 365 బూత్ అధ్యక్షులుగా స్నేహ, 366 బూత్ దినేశ్‌ను ఎంపిక చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ రోడ్డులోని గణేష్‌నగర్‌లో ఉన్న సర్ మౌంట్ స్కూల్ శనివారం విద్యార్థులచే నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ అతిథులను ఆలోచింపజేసింది. ముఖ్య అతిథిగా ఐఐసీటీ సైంటిస్టు రమేష్ హాజరై, విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. సైన్స్ నిత్య జీవితంలో ముఖ్య భాగమని సైన్స్ లేనిది ప్రపంచం లేదన్నారు. పాఠశాల చైర్మన్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో తొలిసారిగా 80 సెంటిమీటర్ల డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసిన ఏకైక స్కూల్ అన్నారు.

కోళ్ల పందాలు కాస్తున్న నలుగురి అరెస్ట్

ఘట్‌కేసర్: కోడి పందాలు కాస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ మోడీ బిల్డర్ వెంచర్‌లో కొందరు కోడి పందాలు కాస్తున్నారనే సమాచారం అందుకొని ఘటనా స్థలానికి వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులను చూసి పందెం రాయుళ్లు పారిపోతుండగా అన్నపురెడ్డి రవి, బండారి శీను, ముద్దినేని కృష్ణంరాజు, మారెళ్ల చాణిక్యరాజును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,600లు సీజ్ చేశారు. అనంతరం వారిపై తెలంగాణ గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్యం 100%

- పన్నుల టార్గెట్ రూ.25.04 కోట్లు
- పంచాయతీల్లో వసూలైంది రూ.20.09 కోట్లే..
- రోజువారీ టార్గెట్‌తో స్పెషల్ డ్రైవ్: డీపీఓ వెంకటయ్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పంచాయతీ శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నుల రూపేనా రూ.25.04 కోట్లు వసూలు చేయాలన్న లక్ష్యం పెట్టుకుంది. అయితే ఇప్పటి వరకు రూ.20.09 కోట్లు వసూలైంది. దాదాపు ఏడు రోజుల వ్యవధిలో రూ.5.20 కోట్ల పన్నులు వసూలు చేయడంపై జిల్లా పంచాయతీ శాఖ దృష్టి సారిస్తున్నప్పటికీ సాధ్యమవుతుందా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కీసర మండలంలో రూ.64.04 లక్షలు, మేడ్చల్ మండలంలో రూ.1.38 కోట్లు, ఎంసీపల్లి మండలంలో రూ.40.91 శామీర్‌పేట మండలంలో రూ.85.15, ఘట్‌కేసర్ మండలంలో రూ.1.92 కోట్ల పన్నులను ఈ నెలాఖరు వరకు వసూలు చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో అక్రమ మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే వాటిపై చూపిస్తున్న శ్రద్ధ.. పన్నుల వసూళ్లు, అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను అరికట్టడంలో కార్యదర్శులు చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిని పర్యవేక్షించాల్సిన ఎంపీఓలు, ఎంపీడీఓలు అటువైపు దృష్టి సారించలేకపోవడంతో.. పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. సంపాదనకు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటి అనుమతులు మొదలుకొని.. ఇంటి నంబర్ల కేటాయింపు వరకు వసూళ్ల పర్వానికి తెర లేపుతున్నారంటూ ఆరోపిస్తున్నారు.

పంచాయతీల్లో పాలకవర్గం లేక..

పంచాయతీల్లో పాలక వర్గం(సర్పంచుల) పదవీ కాలం ముగిసి రెండు నెలల కావస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయినా పంచాయతీల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొంది. కొన్నింటిలో ట్రాక్టర్లకు నెల వారి బ్యాంకు కిస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కరెంటు బిల్లుల పరిస్థితి అలాగే ఉంది. పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు కూడా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జోరుగా అక్రమ కట్టడాలు, లేఅవుట్లు కొనసాగుతున్నా.. ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీల్లో పూర్తి పర్యవేక్షణ కొరవడింది. ప్రత్యేకాధికారులు తమ విధులతో పాటు పంచాయతీల పర్యవేక్షణ తలకు మించిన భారమవుతోంది. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. ప్రత్యేక అధికారులతో సహా మిగతా ఉద్యోగులందరికీ ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో పంచాయతీల పర్యవేక్షణ స్పెషల్ ఆఫీసర్లు నిర్వర్తించలేకపోతున్నారన్న అపవాదులను ఎదుర్కొంటున్నారు. జిల్లాస్థాయి అధికారులను కూడా పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడంతో కొందరికి గ్రామాల పర్యవేక్షణపై సరైన అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పన్ను వసూళ్లలో..

పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తోంది. ఇటీవల జెడ్పీ సమావేశంలో కూడా పలువురు సభ్యులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాణిజ్య వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి పన్ను మదింపు(ఖరారు)లో గ్రామ కార్యదర్శులు అమ్యమ్యాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. భవన సముదాయాల స్థలాన్ని తగ్గించి.. పన్నులు ఖరారు చేయడంతో ప్రభుత్వం ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆందోళన చెందారు. భవనాల నిర్మాణాల అనుమతుల విషయంలో కూడా పంచాయతీ ఉద్యోగులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



జిల్లా పంచాయతీ శాఖ నిర్దేశించిన వివిధ పన్నుల టార్గెట్‌లో దాదాపు రూ.5 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ నెలాఖరు వరకు ఆ పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. పన్నుల వసూళ్లకు సంబంధించి రోజువారీగా లక్ష్యాలను ఖరారు చేయడం ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై దృష్టి సారిస్తున్నాం. చీర్యాల పంచాయతీలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన 51 ఇళ్లను కూల్చివేశాం. ఇందులో 4 ఇళ్లు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించారు. కీసర ఓఆర్‌ఆర్ ప్రాంతంలో అక్రమంగా 4 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను కూల్చివేశాం. ఎలాంటి ఫిర్యాదులున్నా ప్రజలు నా దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవలే బాధ్యతలు చేపట్టంతో అవగాహన కోసం గ్రామాల్లో తిరుగుతున్నాం.

– డీపీఓ వెంకటయ్య

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఘట్‌కేసర్: ఎఫ్‌ఎస్‌సీఎస్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి జిల్లా సహకార అధికారికి శనివారం వినతి అందజేశారు. సర్వసభ సమావేశానికి రాజకీయ నాయకుల ముసుగులో వచ్చే వారిని ఆపాలని, వ్యవసాయ భూమి లేకుండానే సభ్యత్వం పొందిన వారిని అనర్హులుగా ప్రకటించాలని, విక్రయించిన భూమిని తాకట్టుపెట్టి రుణం పొందినవారు, బినామీ రుణం తీసుకున్న వారిపై విచారణ జరపాలని, పాలక మండలి సభ్యుల కుటుంబ సభ్యులను అక్రమంగా ఉద్యోగులుగా నియమించిన వారిపై శాఖపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

వినతిపత్రం అందజేత



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు (మినీట్యాంక్‌బండ్)లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని బీఆర్‌ఎస్ నేతలు కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం 19వ డివిజన్ పరిధి కాలనీల బీఆర్‌ఎస్ నాయకులు అలువాల దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్‌ను కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే డ్రోన్ సాయంతో దోమల మందును పిచికారీ చేయించి, ఓపెన్ నాళాలు, స్లాబుల కింద పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివిధ కాలనీల ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, ఆర్గనైజర్లు, సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి సీటు ఖచ్చితంగా గెలవాలి

పార్టీ నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఖచ్చితంగా గెలిచి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని సీఎం నివాసంలో శనివారం పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి మల్కాజిగిరి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి మినీ భారత్‌గా పేరొందిందన్నారు. ఇక్కడ అన్ని ప్రాంతాల ప్రజలతో పాటు ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు అనేకం ఉంటాయన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలందర్నీ కలిసి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ప్రధానంగా మేడ్చల్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లను కలవడంతో పాటు వారి మద్దతు కూడగట్టుకొనేందుకు తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత ఇన్‌చార్జ్‌లను కోరారు. పారిశ్రామిక ప్రాంతంగా విరాజిల్లుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే.. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ విజయబావుట ఎగుర వేయాల్సిందేనన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిచితమేనని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రజలకు అనేక సేవలు అందించారని, ఎంపీగా గెలిపిస్తే.. నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్నెళ్ల తర్వాత.. ఆరు గ్యారంటీలపై నిలదీస్తాం

- మేడ్చల్ విజయ సంకల్ప సభలో ఈటల రాజేందర్
- ఇల్లు వాకిలి మల్కాజ్‌గిరి పరిధిలోనే ఉంది
- 1992 నుంచి మేడ్చల్ మండల పరిధిలోనే ఉంటున్నా..
- బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు, యువకులు



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు, యువకులు

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే మురికి కాల్వలో వేసినట్లేనని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచకపాలన సాగించిందని, ఆ పార్టీ నాయకులు ఎన్నికల పేరుతో మరోసారి ఓట్లు అడగడానికి వస్తారని, ఆ పార్టీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే అనే తప్పుడు అపవాదుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాలేకపోయిందని అన్నారు. బీఆర్‌ఎస్‌పై కోపంతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారని, ఆ పార్టీపై ప్రేమతో కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఆరు నెలలు పూర్తయిన తర్వాత ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీస్తామని అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తనను నాన్‌లోకల్ అన్నారని, ఆయన వారి పార్టీ నుంచి ఎవరికి టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. తాను 1992 నుంచి నియోజకవర్గ పరిధిలోని దేవరయాంజాల్‌లో వ్యాపారం చేస్తున్నానని, 2002 నుంచి ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటున్నానని, తాను చస్తే ఇక్కడే పెడతారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడి వాడని మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేశారని ప్రశ్నించారు. సీఎం పదవిలో రేవంత్‌రెడ్డి ఏదిపడితే అది మాట్లాడటం సమంజసం కాదన్నారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు..

గత ఎన్నికల్లో ఓటర్లు వివిధ పార్టీలకు ఓట్లు వేసినా పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ బీజేపీని బలపరుస్తున్నారని అన్నారు.

బీజేపీలో చేరికలు..

మండలంలోని అత్వెల్లి, సోమారం, ఎల్లంపేట్, మేడ్చల్, పూడూర్, నూతన్‌కల్ తదితర గ్రామాలకు చెందిన నాయకులు, యువకులు బీజేపీలో ఈటల సమక్షంలో చేరారు. మండలానికి చెందిన సీనియర్ నాయకుడు నారెడ్డి నందారెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, మురళీధర్‌గుప్తా, వైశ్య సంఘం, ముదిరాజ్ సంఘం, మార్వాడీ మంచ్ తదితర సంఘాలకు చెందిన వారు ఈటల సమక్షంలో పార్టీలో చేరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలి




మేడ్చల్‌రూరల్: దేశంలోని రాష్ట్రాల భాషలు, సంప్రదాయాల్లో ఎంతో గొప్పదనం ఉంటుదని, ప్రతి ఒక్కరూ మాతృ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని సెయింట్ పీటర్స్ కళాశాల సెక్రటరి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంఘమా 2 కె24 పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పలు రాష్ట్రాల్లో జరుపుకునే పండగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే వేదికపై వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలను ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థులు, అధ్యాపకులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ వెంకట్‌ను అభినందించారు. డైరెక్టర్లు సరోజారెడ్డి, కో ఆర్డినేటర్లు వెంకట్, భాస్కర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, రవి శంకర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం, ఆవిష్కరణలు పెంపొందించేందుకు..

అనురాగ్ విశ్వవిద్యాలయం సీఎస్ఐఆర్–ఐఐసీటీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న యూనివర్సిటీ, సీఎస్ఐఆర్–ఐఐసీటీ ప్రతినిధులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ విశ్వవిద్యాలయం మధ్య సీఎస్ఐఆర్–ఐఐసీటీ అవగాహన ఒప్పందం శనివారం(ఎంఓయూ) కుదుర్చుకుంది. యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఈఓ నీలిమా ఆదేశం మేరకు సీఎస్ఐఆర్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్, కిమ్స్ అధినేత డాక్టర్ రాజేంద్రరెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బాలాజీ ఉట్ల, ఫార్మసీ డీన్ వసుధ భక్షి, డాక్టర్ లింగయ్య, రసాయన శాస్త్రం హెచ్ఓడీ సవితా బెల్వాల్ ఒప్పంద పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పందం ద్వారా రెండు సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని అధికారికం చేయడమే కాకుండా శాస్త్రీయ పరిజ్ఞానం, ఆవిష్కరణలు పెంపొందించడానికి తోడ్పడుతుందన్నారు.

14న ఉచిత మెగా బ్రాహ్మణ వివాహ వేదిక

మల్కాజిగిరి: కాప్రా నగర బ్రాహ్మణ సేవా సమాఖ్య 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 14న ఉచిత మెగా బ్రాహ్మణ వివాహ వేదికను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు ఓఎస్ఆర్ శర్మ, రాంబాబు, కెకెబీఏ శర్మ తెలిపారు. శనివారం ఆనంద్‌బాగ్‌లో ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ.3 లక్షలు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశామన్నారు. 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ వివాహ వేదికతో 5000ల మంది ఒక్కటయ్యారన్నారు. వివరాలకు www.kalyaanavedika.co.inలేదా 9985795760.

ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి దేవాయంలో శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, అలంకరణ, అర్చన పూజా కార్యక్రమాలు జరిపామని అర్చకులు శ్యామ్‌ప్రసాద్‌శర్మ ప్రకటించారు.

హోలీ సంబురాలు..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు హోలీ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. హోలీ వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో కెమికల్స్ లేని రంగులతో నిర్వహించుకోవాలని సూచించారు. నూతనంగా మార్కెట్‌లోకి వస్తున్న కెమికల్స్ కలర్స్ వల్ల ప్రమాదం పొంచి ఉందని, వాటిని ఎవరూ వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్కాజ్‌గిరిలో ఎంపీ సీటు మాదే..

నేడు తూంకుంటలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్: మల్కాజ్‌గిరి పార్లమెంట్‌తో పాటు రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తూంకుంటలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో అమలు చేశామని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతామని అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీలోని మొగుళ్ల వెంకట్‌రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ అభ్యర్థి సునీతమహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి హాజరవుతారని, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు. సమావేశంలో తూంకుంట మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎంసీపల్లి మండల అధ్యక్షుడు నర్సింహులు, శామీర్‌పేట అధ్యక్షుడు వైఎస్ గౌడ్, పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

8న హైదరాబాద్ సభకు మాలలు తరలిరావాలి

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



మాట్లాడుతున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

ఘట్‌కేసర్: పేద, ధనిక వర్గాల మధ్య దూరం రోజురోజుకూ పెరుగుతోందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎన్ఎఫ్‌సీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలనే శక్తులను నిర్వీర్యం చేసేందుకు వచ్చేనెల 2న మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందని, ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో ముగియనున్న సభకు పెద్ద ఎత్తున మాలలు హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి మురళి, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు పరుశురాం పాల్గొన్నారు.